## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ బి.జ్యోతి

జామి: మండలంలోని కుమరాం కేజీబీవీ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో జరిగిన అండర్–19 స్కూల్ గేమ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో హాకీ, త్రోబాల్ విభాగాల్లో పాఠశాలకు చెందిన బి.గాయత్రి, ఆర్.రోహిత్, ఎ.వర్షిత చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ బి.జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



పైడిరాజు దంపతులను సత్కరిస్తున్న స్థానిక నేతలు, ఉపాధ్యాయులు

గుర్ల: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పెద్దబంటుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జట్ల పైడిరాజు దంపతులను స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డపు సతీష్, హెచ్ఎం ఎం.భవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు కంకణాల రమణ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం



విరాళం అందజేస్తున్న లక్ష్మునాయుడు

చీపురుపల్లి: చీపురుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి గరివిడి మండలం కె.పాలవలసకు చెందిన ముల్లు లక్ష్మునాయుడు, లక్ష్మీ దంపతులు రూ.50,116లు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్టుబోర్డు మెంబర్లు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, దాసరి రవిశంకర్‌లకు బుధవారం అందజేశారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ రవిప్రసాద్

గజపతినగరం: స్థానిక లయన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు మంటలను ఎలా అదుపు చేయాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపకశాఖ అధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమయంలో, గ్యాస్‌పై వంట చేస్తున్న సమయంలో మంటలు వ్యాపిస్తే వాటిని ఎలా అదుపు చేయాలో ప్రయోగపూర్వకంగా వివరించారు.

### డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారణ

దత్తిరాజేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు తరచూ గొడవపడుతున్నట్లు అందిన ఫిర్యాదుపై జిల్లా ఉప వైద్యాధికారి రవికుమార్ బుధవారం విచారణ చేపట్టారు. డాక్టర్ సతీష్‌కుమార్ సెలవులో ఉండడంతో మరో వైద్యాధికారి ఆనంద్‌కుమార్, సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. వాగ్వివాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని, వారి సూచనల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

### రికార్డులు పక్కాగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓలు శోభారాణి, వెంకటరమణ

బొండపల్లి: పాఠశాల నిర్వహణకు సంబంధించిన అన్ని రికార్డులు పక్కాగా ఉండాలని ఎంఈఓ లు శోభారాణి, అల్లు వెంకటరమణ అన్నారు. మండలంలోని గొల్లుపాలెం ఎంపీపీ స్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. టోఫెల్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, స్మార్ట్ టీవీలను సక్రమంగా ఉపయోగించాలని, గ్రామంలో పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి వారంతా మరోసారి పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# జగనన్న సురక్ష.. ఆరోగ్య భరోసా..

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందిస్తుండగా.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో వైద్య సేవలను ఇంటి వద్దకే చేర్చింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి నిపుణులైన వైద్యులతో గ్రామాల్లోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి స్థాయి వైద్య సేవలు అందించేందు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వందలాది మంది రోగులకు వైద్యులు అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పలువురిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఎల్.కోట మండలం లచ్చింపేట సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్ పరిశీలించారు. ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చిన ప్రతీ రోగికి వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. గరివిడి మండలం గెడ్డపువలసలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరమని, ప్రతి ఒక్కరూ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. కొత్తవలస మండలం దేవాడ, జామి మండలం చింతాడ, ఎస్.కోట మండల కేంద్రంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని రోగులకు మందుల కిట్లు అందజేశారు. చీపురుపల్లి మండలం పేరిపిలో, గుర్ల మండలం నడుపూరులో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు, మంత్రి బొత్స సత్యనారాయణ తనయుడు బొత్స సందీప్ పాల్గొని రోగులకు హెల్త్ కిట్లు అందజేశారు.

– చీపురుపల్లి/గజపతినగరం/ఎస్.కోట నెట్‌వర్క్



లక్కవరపుకోట: లచ్చింపేటలో జగనన్న సురక్ష శిబిరం ఓపీ కౌంటర్ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి



జామి: చింతాడలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షల రిపోర్టును అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



గంట్యాడ: పెదవేమలి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధురాలికి మందులు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ నరసింహమూర్తి



మెంటాడ: గజపతినగరం మండలం కొత్తబగ్గాంలో వృద్ధుడికి ఆరోగ్య సురక్ష కిట్టు అందజేస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోట గ్రామ సచివాలయం-3 వద్ద జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో మహిళకు హెల్త్‌కిట్టు అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు



కొత్తవలస: దేవాడలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



చీపురుపల్లిరూరల్: గరివిడి మండలం గెడ్డపువలస జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో హెల్త్ కార్డును అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



బొండపల్లి: అంబటివలసలో వృద్ధుడికి కళ్లద్దాలు పెడుతున్న ఎంపీపీ చల్లా చలంనాయుడు



గుర్ల: నడుపూరులో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స సందీప్



వేపాడ: జాకేరు జగనన్న సురక్షలో ఆయుష్మాన్ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు



చీపురుపల్లిరూరల్: పేరిపిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో హెల్త్ కార్డు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స సందీప్

# సీఎం జగన్‌తోనే ప్రగతి సాధ్యం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

● ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

మెంటాడ(గజపతినగరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో ప్రగతి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గజపతినగరం మండలం గుడివాడ గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయా కుటుంబాలకు జరిగిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామానికి లింకురోడ్డు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంకా గ్రామానికి ఏమి కావాలన్నా చేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు ఏర్పాటు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మీరంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాండ్రాపు రామునాయుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల కన్వీనర్ బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, వైస్ ఎంపీపీ గెద్ద దమయంతి, మండల నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, జేసీఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం, సోషల్‌మీడియా కన్వీనర్ తాతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, తదితరులు

**ప్రతీ ఇంటికి సంక్షేమం**

గుర్ల: అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని జమ్ములో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ జమ్ము రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, గొలగాం సర్పంచ్ కలిశెట్టి అప్పలరాజు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు న్యాయం చేయడమే రాజకీయం

● ఎంపీ జీవీఎల్ నరసింహారావు

శృంగవరపుకోట: అన్ని సామాజిక వర్గాలకు సముచిత న్యాయం చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు దోహదం చేసేదే రాజకీయం అని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు అన్నారు. స్థానిక మయూర ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన తూర్పుకాపు సామాజిక వర్గ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల తూర్పుకాపులను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు జీవీఎల్ చేసిన కృషిని తూర్పుకాపు నాయకులు కొనియాడారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం జీవీఎల్ మాట్లాడుతూ.. కులం కోసం పార్టీలు పక్కన పెట్టి అంతా ఒక్కటిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, ఎల్.కోట మండలం తలారి గ్రామ సర్పంచ్ జి.ప్రసాద్, ముకుందపురం సర్పంచ్ ఎస్.కనకరాజు, ఎంపీటీసీ కె.జగ్గన్నదొర, దుల్ల సన్యాసిరావు, చింతల నారాయణమూర్తి, ఆవాల గోపాలకృష్ణ, శానపతి ఈశ్వరరావు, ఐదు మండలాలకు చెందిన కాపు నాయకులు హాజరయ్యారు. అనంతరం స్థానిక కాపు నేతల వినతి మేరకు ఎస్.కోట రైల్వేస్టేషన్‌ను జీవీఎల్ నరసింహారావు సందర్శించారు. రైల్వే ప్రయాణానికి ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక నేతలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విశాఖ–జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైల్‌కు ఈ స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని, రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. దీనిపై స్పందించిన జీవీఎల్ రైల్వే డీఆర్‌ఎంతో ఫోన్లో మాట్లాడి ఈ ప్రాంత ప్రయాణికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఎల్.కోట మండలం గొల్జాం గ్రామానికి వెళ్లి కాపునేత తూర్పాటి కృష్ణస్వామినాయుడును పరామర్శించారు.



జీవీఎల్ నరసింహారావును సన్మానిస్తున్న తూర్పుకాపు నేతలు

# నేడు టి.భూర్జవలసలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలస గ్రామంలో జగనన్న 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇటీవల ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు చేసిన ఆరోగ్య సర్వేలో అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గుర్తించిన రోగులకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేసి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. భూర్జవలస, భూపాలరాజపురం, తిమిటేరు గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**గరుడుబిల్లిలో..**

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో గురువారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. రోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 150 రోజులు పని కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘం జిల్లా నాయకుడు జగన్

వేపాడ: జాతీయ ఉపాధిహామీ పథకం చట్టంలో మార్పులు చేసి వేతనదారులకు 150 రోజులు పని కల్పించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామస్వామిపేటలో ఉపాధి వేతనదారులు, వ్యవసాయ కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనిదినాలను 150 రోజులకు పెంచాలని కోరారు. ప్రస్తుతం వందరోజులు పనికల్పిస్తుండడంతో ఒక కుటుంబానికి నెల రోజులకే పనిదినాలు పూర్తవుతున్నాయని, మిగిలిన రోజుల్లో పనిలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

**ఎంపీడీఓకు వినతి**

దత్తిరాజేరు: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులకు పనిదినాలు, వేతనాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయుడు కోరారు. ఈ మేరకు వేతనదారులతో కలిసి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంకు బుధవారం వినతిపత్రం అందజేశారు.

### చెత్త సేకరణ బుట్టల పంపిణీ



చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ గంగరాజు

వేపాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లోని చెత్తను వీధుల్లో పారబోయకుండా చెత్త బుట్టల్లో వేసి చెత్తసేకరణ కార్మికులకు అందజేయాలని ఎంపీపీ సత్యవంతుడు అన్నారు. సోంపురం గ్రామంలో సర్పంచ్ మురిపిండి గంగరాజు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ రెండు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఎంపీటీసీ సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ శ్రీను, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

# రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో రోబో కపులర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రోబోల తయారీపై బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ.. మానవ అవసరాలకు అనుగుణంగా రోబోల తయారీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులను విద్యార్థులు అర్థం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, సీఎస్ఈ విభాగాధిపతి ఎం.ఉమామహేశ్వరరావు, ఈసీఈ విభాగాధిపతి ఎస్.చంద్రశేఖరరావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.జాషువా జయప్రసాద్

# బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

బాలికలు అన్ని రంగాలలో రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, సంరక్షణ చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, తదితర అంశాలపై వక్తలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విద్యార్థులు సోషల్‌మీడియా మాయలోపడి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

– చీపురుపల్లి/గజపతినగరం/ఎస్.కోట నెట్‌వర్క్



చీపురుపల్లి రూరల్: గరివిడి కేజీబీవీలో బాలికలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ పి.రామారావు



గుర్ల: పాలవలస జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు



మెరకముడిదాం: కేజీబీవీలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఓ బేగమ్



దత్తిరాజేరు: గడసాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరాభవాని



బొండపల్లి: దేవుపల్లి కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పీఓ చంద్రకళ



గజపతినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన బాలికల దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ఆర్.సత్యనారాయణ, అధ్యాపక సిబ్బంది



కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ సీతామహలక్ష్మి

# ఈ–శ్రమ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

శృంగవరపుకోట: కార్మికుల సామాజిక భద్రతే లక్ష్యంగా కేంద్రం ప్రవేశపెట్టిన ఈ–శ్రమ్ కార్డుల కోసం కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.కిరణ్‌చంద్ర కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసంఘటిత కార్మికుల గుర్తింపునకు ఆధార్ తరహాలో యూనివర్సల్ అకౌంట్ నంబర్‌తో ఈ–శ్రమ్ గుర్తింపు కార్డులను కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తోందన్నారు. 16 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉండి ఈఎస్ఐ లేదా ఈపీఎఫ్ సభ్యత్వం లేని భవన నిర్మాణం, వలస, వ్యవసాయ కార్మికులు, ఆశా వర్కర్లు, ఇళ్లల్లో, దుకాణాల్లో పనిచేసేవారు, తోపుడు బండి వర్తకులు, హమాలీలు, ఉపాధిహామీ కార్మికులు పథకానికి అర్హులని చెప్పారు. ఈ–శ్రమ్ పోర్టల్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, లేదా స్థానిక లేబర్ ఆఫీస్‌లో, గ్రామ సచివాలయంలో, సీఎస్‌సీ, మీ–సేవ సెంటర్లలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల నమోదుకు ఆధార్, నామినీ ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, సెల్‌ఫోన్ నంబరు అవసరమవుతాయన్నారు. కార్డు పొందిన వారికి రూ.2 లక్షలు ప్రమాద బీమా, సంపూర్ణ అంగవైకల్యానికి గురైతే రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.1లక్ష బీమా పరిహారం అందుతుందన్నారు. ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికుల్లో ఎవరికైనా రేషన్ కార్డు లేకపోతే వారికి రేషన్‌కార్డు జారీ చేస్తారని చెప్పారు.